విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

బుధ వారం

4.5.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-69

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్వీరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



## డెన్మార్క్ చేరుకున్న ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, మే 3 (అక్షర వెలుగు):** ఐరోపా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు డెన్మార్క్ చేరుకున్నారు. ఆ దేశ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్ సెన్‌తో ఆమె నివాసంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మూడు రోజుల ఐరోపా పర్యటనలో భాగంగా.. రెండో రోజు డెన్మార్క్ చేరుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. కొపెన్‌హాగెన్ విమానా శ్రయంలో ఆయనకు డానిష్ ప్రధాని ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరు దేశాధినేతలు ఆమె నివాసానికి వెళ్లారు. అక్కడే ఆమెతో మోదీ ప్రత్యేకంగా మాటామంతీలో పాల్గొ న్నారు. ఈ భేటీ అనంతరం రెండో ఇండియా-నోర్డిక్ సమావేశంలో మోదీ పాల్గొననున్నారు.

# ఓయూలో మరోమారు ఉద్రిక్తత






### రాహుల్ దిష్టిబొమ్మ దగ్ధం

### చేసిన టీఆర్ఎస్వీ

**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** ఉస్మానియా యూనివర్శిటీలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పర్యటనను వ్యతిరేకిస్తూ టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు... పలువురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఓయూలో రాహుల్ గాంధీ అడుగుపెడితే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ అమర వీరుల కుటుంబాలను పరామర్శించిన తర్వాతనే ఓయూలో రాహుల్ గాంధీ అడుగుపెట్టాలని టీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేశారు

## దేశవ్యాప్తంగా వేడుకగా రంజాన్

### రెండేళ్ల తరవాత సజావుగా ప్రార్థనలు



**న్యూఢిల్లీ, మే 3 (అక్షర వెలుగు):** దేశవ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించు కున్నారు. కరోనా మహమ్మారి విజృంభణ నేపథ్యంలో దాదాపు రెండేండ్ల తర్వాత... మళ్లీ దేశంలోని అన్ని మసీదులు ముస్లిం సోదరులతో కళకళలాడాయి. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పర్వదినం

2

## రైస్ మిల్లులపై దాడులతో కొనుగోళ్లకు ఇక్కట్లు

### ఇప్పుడే దాడులు చేయాల్సిన పనేంటి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వీటిని ఆపాలి: గంగుల




**కరీంనగర్, మే 3 (అక్షర వెలుగు):** రైస్ మిల్లుల్లో జరుగుతున్న అక్రమాల తీరుపై భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) చేస్తున్న దాడులపై తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ఎఫ్‌సీఐ తనిఖీల వెనుక కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమేమిటని ప్రశ్నించారు. రైతుల సజావుగా ధాన్యం

2

## రైతుల కోసం వరంగల్ డిక్లరేషన్

### ఏం చేయబోతున్నామో ప్రకటించనున్న రాహుల్

### కెసిఆర్ తీరువల్ల రైతులకు తీవ్రనష్టాలు

### ఇప్పటికీ 20శాతం పంట కొనుగోల్ల చేపట్టలేదు

### మీడియా సమావేశంలో ఎంపి కోమటిరెడ్డి



**యాదాద్రిభువనగిరి, మే 3 (అక్షర వెలుగు):** రైతులకు ఏమి చేయబోతున్నామనేది వరంగల్ సభలో రాహుల్‌గాంధీ ప్రకటిస్తారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఓయూకి రాహుల్‌గాంధీ వచ్చి విద్యార్థులతో మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆయనను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. భువనగిరి గెస్ట్ హౌస్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తెరాస ప్రభుత్వ పతనానికి వరంగల్‌లో నిర్వహించే రాహుల్ సభ నాంది పలుకుతుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏడాదిలోపే

2

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు క్యాన్సర్ చికిత్స

### భద్రతా మండలి కార్యదర్శి నికోలారు పత్రుషేవ్‌కు అధికారం

### అమెరికాకు చెందిన వార్తా సంస్థ న్యూయార్క్ పోస్టు వెల్లడి

**మాస్కో, మే 3 (అక్షర వెలుగు):** రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ క్యాన్సర్ చికిత్స తీసుకోనున్నారని, ఈ నేపథ్యంలో అధికారిక బాధ్యతలను తాత్కాలికంగా బదిలీ చేయనున్నారని అమెరికాకు చెందిన వార్తా సంస్థ న్యూయార్క్ పోస్టు తెలిపినట్లు సమాచారం. ఆ దేశ భద్రతా మండలి కార్యదర్శి నికోలారు పత్రుషేవ్‌కు తాత్కాలికంగా అధికారాన్ని అప్పగించే అవకాశం ఉందని

2

## ఈద్గాలో ముస్లింల రంజాన్ ప్రార్థనలు

### అభినందనలు తెలిపిన మంత్రి ఇంద్రకరణ్



**నిర్మల్, మే 3 (అక్షర వెలుగు):** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు మంగళవారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాం చౌరస్తా వద్ద ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. అన్ని మతాల వారిని సమానంగా గౌరవిస్తూ, వారి శ్రేయస్సు కోసం

# హైదరాబాద్‌లో ప్రశాంతంగా రంజాన్ ప్రార్థనలు

### సిద్ధిపేటలో ముస్లింలకు మంత్రి హరీష్ శుభాకాంక్షలు



**హైదరాబాద్, మే 3 (అక్షరవెలుగు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రంజాన్ పర్వదినం వేడుకలు ఘనంగా జరిగాయి. చార్మినార్, మక్కా మసీదు, మీరాలం ఈద్గాతో పాటు రాష్ట్రంలోని అన్ని మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనలతో మసీదులు, ఈద్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ శుభాంక్షలు చెప్పుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లిములు సోమవారం సాయంత్రం విరమించారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాల నుంచి ముస్లింలు ఇంటి వద్దనే రంజాన్ వేడుకలు జరుపుకొన్నారు. ప్రస్తుతం కరోనా తగ్గుముఖం పట్టడంతో ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సిద్ధిపేట ఈద్గా వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ పాల్గొన్నారు. రంజాన్ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు సంతోషంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. పేద ముస్లిం ఆడపిల్లల వివాహాల కోసం

2

## ఉపాధి నిధులు ఇవ్వాల్సింది ఎవరు ?

### బండి సంజయ్ జూటా మాటలు ఎందుకు

### మండిపడ్డ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్, మే 3 (అక్షర వెలుగు):** మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు రావడం లేదన్నది ఎంత నిజమో..వాటిని ఇవ్వాల్సిన కేందరం ఇవ్వక పోడం కూడా అంతే నిజమని, దీనికి బిజెపిదే బాధ్యతని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్ జూటా మనిషి అని... బీజేపీ జూటా పార్టీ అని వ్యాఖ్యలు చేశారు. మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు రావడం లేదన్నది నిజమే... కానీ ఆ డబ్బులు ఇచ్చేదెవరో చెప్పలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇవ్వడం లేదని తెలిపారు. నేరుగా ఉపాధి కూలీల డబ్బులు వారి ఖాతాల్లో నేరుగా పడతాయని... రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఆపుతుందని నిలదీశారు. ఉపాధి హామీ పనుల నిధులపై చర్చకు సిద్ధమా..? అని మంత్రి సవాల్

## రాహుల్ పబ్‌కు వెళ్లారన్న ప్రచారం దుర్మార్గం

### ఫంక్షన్‌కు వెళ్లినా ఇలాంటి ప్రచారాలేనా

### రాహుల్ రాకతో అధికార టిఆర్ఎస్‌లో వణుకు

### టిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ జగ్గారెడ్డి




**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పబ్‌కు వెళ్లారని జరుగుతున్న ప్రచారంపై ఆ పార్టీకి చెందిన తెలంగాణ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ఫంక్షన్‌కు వెళ్ళిన చోట ఏముందో రాహుల్ గాంధీకి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. అక్కడ జరిగేదానికి రాహుల్ గాంధీకి ఏం సంబంధం అని అన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ నేతలు చిల్లరగాళ్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ ఫంక్షన్‌కు వెళ్ళిన వీడియోలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పెళ్లికి వెళ్లిన వీడియోని చూపిస్తూ రాజకీయం చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర రాజకీయాలు మానాలని అన్నారు.

2

## డిజిపికి ఫిర్యాదుచేసేందుకు వెళ్తుండగా..

### కెఎ పాల్ గృహ నిర్బంధం



**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్‌ను పోలీసులు గృహనిర్బంధం చేశారు. డీజీపీ మహేందర్ రెడ్డిని కలిసేందుకు ఇంటి నుంచి కేఏ పాల్ బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు.. కేఏ పాల్‌ను ఇంటి వద్దనే అడ్డుకున్నారు. అనుమతి లేదని హౌస్ అరెస్ట్ చేశారు. సోమవారం తనపై జరిగిన దాడి గురించి డీజీపీకి ఫిర్యాదు చేస్తానని.. అందుకే వెళ్తున్నట్లు చెప్పినప్పటికీ.. పోలీసులు ఆయన్ని గృహనిర్బంధం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించడానికి కేఏ పాల్ వెళ్తుండగా.. ఆయనపై తెరాస నేత చేయి చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా జక్కపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కేఏపాల్ పర్యటనకు అనుమతి లేదని.. జిల్లాకు రాకుండా పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న తెరాస శ్రేణులు అక్కడికి చేరుకున్నారు.కేఏ పాల్ పోలీసులతో మాట్లాడుతుండగానే అక్కడే ఉన్న ఓ తెరాస నేత పాల్ చెంప పగలగొట్టారు. కేఏ పాల్ చెంపపై కొట్టడంతో గందరగోళం నెలకొంది. అక్కడున్న వారు ఆ వ్యక్తిని అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారకుండా.. ఇరువర్గాలను పోలీసులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు కేఏ పాల్‌ను తన వాహనంలో ఎక్కించి హైదరాబాద్ వైపు తరలించారు. ఈ విషయమై మంగళవారం కేఏ పాల్ డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా.. పోలీసులు గృహనిర్బంధం చేశారు.

## సిద్దిపేట ఆస్పత్రిలో మోకాలుచిప్పల మార్పిడి

### పేషెంట్లకు మంత్రి హరీస్ రావు పరామర్శ



**సిద్దిపేట, మే 3 (అక్షర వెలుగు):** గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్‌కే పరిమితమైనా మోకాలి చిప్పలు మార్పిడి చికిత్సను త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఇటీవల మోకాళ్ల చిప్పల ఆపరేషన్లు చేయించుకున్న పేషెంట్లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం ఇద్దరికి సిద్దిపేట దవాఖానలో మోకాలి చిప్పలు మార్పిడి

2

## కవితకు ఆటా ప్రతినిధుల ఆహ్వానం



**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** టీఆర్ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేష్ బిగాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆటా ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. వాషింగ్టన్ డీసీలో జూలై 1 నుంచి 3 వరకు జరిగే ఆటా 17వ మహాసభలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆటా ప్రతినిధులు మాట్లాడుతూ.. అమెరికా నలుమూలల నుంచి దాదాపు 15,000 మంది మహాసభలో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే ఈ సారి తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ని ఏర్పాటు చేయనున్నట్లు.. అందులో మన ఊరు-మన బడి, బతుకమ్మ, తెలంగాణ టూరిజం, వివిధ రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వారు ఎమ్మెల్సీ కవితకు వివరించారు. భవిష్యత్ తరాలకు మన బతుకమ్మ విశిష్టత గురించి తెలిపేందుకు బతుకమ్మ పై ఇంగ్లీష్‌లో పుస్తకాన్ని ముద్రిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటా అధ్యక్షుడు భువనేశ్ భుజాల, శరత్ వేముల, జయంత్ చల్ల, వేణు సంకినేని తదితరులు ఉన్నారు.

## అదృశ్యమైన బాలల శవాలు గుర్తింపు

### కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు అనుమానం

**సంగారెడ్డి, మే 3 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రంజాన్ వేళ విషాదకర సంఘటన చోటు చేసుకున్నది. శ్మశాన వాటికలో విద్యుద్ఘాతంతో ఇద్దరు బాలురు మృతి చెందారు. అయితే, ఇద్దరు బాలురు మూడు రోజుల కిందట అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలురు ఆచూకీ కోసం గాలిస్తున్న క్రమంలోనే ఇద్దరు మృతి చెందారు. మృతులను అబ్దుల్ అజీజ్ (11), ముల్తాని బాబు (16)గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న తలసాని



### ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం రంజాన్ సందర్భంగా సనత్ నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో మంత్రి పాల్గొన్నారు. అదేవిధంగా రాంగోపాల్ పేట డివిజన్‌లోని నల్లగుట్టలో మసీదులో ప్రార్థనలు చేసిన అనంతరం మంత్రి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో జంట మృతదేహాలు

### కుళ్లిన స్థితిలో గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జంట మృతదేహాల కలకలం చోటుచేసుకుంది. కొత్తగూడెం బ్రిడ్జ్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ యువతి, యువకుడి మృతదేహాలు లభ్యమయ్యాయి. నగ్నంగా మృతదేహాలు ఉన్నాయి. గుర్తు పట్టడానికి వీలులేకుండా శవాలు కుళ్లిన స్థితిలో ఉన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హత్యా లేక ఆత్మహత్య అన్న కోణంలో పరిశీలిస్తున్నారు. ఏకాంతంగా ఉన్న జంటను హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మూడు రోజుల క్రితమే వీరిని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మృతులు కవాడిగూడకు చెందిన వారుగా సమాచారం. మృతి చెందిన యువకుడిని యశ్వంత్, యువతిని జ్యోతిగా గుర్తించారు యువతి ముఖం గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉంది. సంఘటన స్థలానికి కొద్దిదూరంలోనే హోండా యాక్టివాను పోలీసులు గుర్తించారు. జంట హత్యలపై పోలీసులు మరింత విచారణ జరుపుతున్నారు.

## తల్లితో వివాహేతర సంబంధం

### వ్యక్తి మర్మాంగాన్ని కోసిన కూతురు

**గుంటూరు, మే 3 (అక్షర వెలుగు):** వివాహేతర సంబంధం నేపథ్యంలో... ఓ వ్యక్తి మర్మాంగాన్ని కోసిన ఘటన సోమవారం రాత్రి పట్టణంలో జరిగింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన ఎస్ రామచంద్రారెడ్డి ఐదేళ్ల క్రితం తెనాలికి వచ్చాడు. అతనికి ఐతానగర్‌కు చెందిన సంధ్య అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. రైల్వే స్టేషన్ సమీపంలోని లాడ్జి లో పనిచేసే రామచంద్ర రెడ్డి సోమవారం రాత్రి సంధ్యతో కలిసి మద్యాన్ని సేవించాడు. ఆ తరువాత ఆమె నివాసముండే భవనంపై నిద్రిస్తున్నాడు. అదే సమయంలో సంధ్య కుమార్తె, మరో యువకుడు కలిసి భవనం పైకి వచ్చి రామచంద్ర రెడ్డి తో గొడవపడ్డారు. అతని మర్మాంగాన్ని కోసేశారు. బాధితుడి కేకలు విన్న చుట్టుపక్కలవారు అతన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న టుటౌన్ సిఐ కోటేశ్వరరావు ఆస్పత్రికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బుధ వారం | 4 | మే | 2022
www.aksharavelugu.com
అక్షర వెలుగు
తెలుగు దిన పత్రిక


## మునుగోడు నియోజకవర్గ బీసీల ఐక్యవేదిక సభను విజయవంతం చేయాలి



బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనగంటి కృష్ణ

**మునుగోడు, మే 3 (అక్షర వెలుగు):** మునుగోడు మండల కేంద్రంలో మే 5,తారీఖున బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్య ఫంక్షన్ హాల్ నిర్వహించే బీసీల ఐక్య వేదిక సభను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనగంటి కృష్ణ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో బీసీ నాయకులు పార్టీలకతీతంగా బీసీ ప్రజాప్రతినిధులు యువజన సంఘాల నాయకులు బీసీ కుల సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు మేధావులు విద్యావంతులు ఈ కార్యక్రమానికి మునుగోడు నియోజకవర్గ బీసీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారు కావున అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో, మునుగోడు గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకన్న తెలంగాణ నల్గొండ జిల్లా జెఎసి చైర్మన్ తోట నరసింహ చారి బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గుంటూ జూ వెంకటాచారి నారాయణపురం బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గణం నరసింహ బీసీ సంఘం నాయకులు ఈదులకంటి కైలాస్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి ఆరేళ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున సాగర్ లో ఘనంగా రంజాన్ వేడుకలు



**నాగార్జునసాగర్, మే 3(అక్షర వెలుగు):** నాగార్జున సాగర్ లో రంజాన్ పర్వదిన వేడుకలు మంగళవారము ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పైలాన్ కాలనీ ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

బేగంపేటలో కారు దగ్ధం • వడదెబ్బకు ఇప్పటి వరకు 8మంది మృతి



**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. భారీ నమోదవుతున్న ఉష్ణోగ్రతలు ప్రమాదానికి దారితీస్తున్నాయి. ఇప్పటికే పలు వాహనాలు అగ్ని ప్రమాదానికి గురవగా.. తాజాగా నగరంలోని బేగంపేటలో కారులో మంటలు చెలరేగాయి. కారులోంచి పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమై కారులోనివారు కిందకుదిగడంలో ప్రమాదం తప్పినట్లయ్యింది. ఆ తర్వాత కారంతా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. తెలంగాణలో ఎండలో బెంబేలెత్తిస్తున్నాయి. వడదెబ్బతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. హన్మకొండకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు జున్ను రాజు గీసకొండలో పని చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన సారాంగం వాటర్ బాటిళ్లు విక్రయిస్తూ వడదెబ్బతో బస్టాండ్?లో మృతి చెందారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో రాజయ్య.. యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్డి నాయక్ తండాలో బుజ్జమ్మ ఎండ తీవ్రతో చనిపోయారు. నాగారం మండలం ఈటూరులో అంజయ్య, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూరు మండలం రాజులగూడు తండాకు చెందిన కూలీ బాలాజీ వడదెబ్బకు బలయ్యారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాదేపాడులో వృద్ధుడు పుల్లయ్య, చింతకాని మండలం గాంధీనగర్‌కు చెందిన మారెముత్తు ఎండల తీవ్రతతో వడదెబ్బకు లోనై చనిపోయారు. రాష్ట్రంలో ఎండలు మండిపోతుండటంతో చాలా ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి.

## ఉస్మానియాలో శాంతికి భంగం కలిగిస్తున్నారు




మానవహక్కుల కమిషన్‌లో న్యాయవాది ఫిర్యాదు

**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మీద జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు హైకోర్టు న్యాయవాది రామారావు ఫిర్యాదు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య ఘర్షణలు ప్రేరేపించే విధంగా శాంతి భద్రతల పరిరక్షణ ,వివిధ అంశాలపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ర్యాదు దర్యాప్తు చేయనుంది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ ప్రేరేపించడంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన జాతీయ మానవ హక్కుల విచారణ జరపనుంది.మే 7న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు రానున్నారు. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో సభ నిర్వహించు కునేందుకు వీసీని అనుమతి కోరగా.. ఆయన నిరాకరించారు. కాంగ్రెస్ వ్యతిరేక విద్యార్థి సంఘాలు రాహుల్ రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం మాత్రం రాహుల్ సభకు అనుమతించాల్సిందేనని పట్టుబడుతోంది. ఈ క్రమంలో ఓయూలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## హైందవాన్ని సంస్కరించిన అభ్యుదయవాది

• బసవేశ్వరుడికి నివాళి అర్పించిన మంత్రి హరీష్



**సిద్ధిపేట, మే 3 (అక్షర వెలుగు):** సమాజంలోని కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయ వాది బసవేశ్వర స్వామి అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పొన్నాల వద్ద ఏర్పాటు చేసిన బసవేశ్వర స్వామి విగ్రహానికి మంత్రి హరీశ్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు ఒకరన్నారు. ఇతడిని బసవన్న, బసవుడు అని, విశ్వగురు అని పిలుస్తారు. లింగాయత ధర్మాన్ని స్థాపించిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అని మంత్రి తెలిపారు. సిద్ధిపేట వచ్చే ప్రతి ఒక్కరూ బసవేశ్వరుడి ఆశీస్సులతో సిద్ధిపేటకు వస్తారన్నారు. 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోసం కృషి చేయడంతో పాటు ఆచరణలో అమలు చేసిన మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చేయాలని, కష్టపడి పని చేసిన వారే జీవితంలో పైకొస్తారని చెప్పిన ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పని చేద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ మీద సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదని మంత్రి తెలిపారు. ఇటీవలే బసవేశ్వర స్వామి పేరు మీద బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ గా కొత్త ప్రాజెక్టు కట్టబోతున్నాం. కుల, మతాలు ఏవైనా భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్న దేశం మనదని, అందరూ కలిసి మెలసి ఉండాలన్న బసవేశ్వరుడి ఆశయాలను ఆచరణలో పాటిద్దామని మంత్రి పేర్కొన్నారు.

## వేములవాడను దర్శించుకున్న మంత్రి కొప్పుల



**వేములవాడ, మే 3 (అక్షర వెలుగు):** వేములవాడ రాజన్న కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం వేములవాడ రాజన్నను మంత్రి కొప్పుల దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ రాజన్న ఆలయ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. దర్శనానికి వస్తున్న భక్తుల ఇబ్బందులను స్వయంగా చూసిన సీఎం కేసీఆర్ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు భూసేకరణ పనులు ప్రారంభించారన్నారు.ముడి చెరువులో 35 ఎకరాలు ఇప్పటికే సేకరణ పూర్తయిందని మంత్రి తెలిపారు. బద్ది పోచమ్మ ఆలయం విస్తరణకు సైతం భూసేకరణ కూడా పూర్తి చేశారన్నారు. యాదాద్రి ఆలయంలాగే సీఎం కేసీఆర్ వేములవాడ, కొండగట్టు ధర్మపురి, జోగులాంబ, భద్రాద్రి ఆలయాలనుకూడా అభివృద్ధి చేస్తారని చేస్తారని స్పష్టం చేశారు. కొంత ఆలస్యం అయినప్పటకి అభివృద్ధి మాత్రం జరిగి తీరుతుందన్నారు.

## సామాజిక వివక్షను వ్యతిరేకించిన బసవేశ్వరుడు

తెలంగాణ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు



**న్యూఢిల్లీ, మే 3 (అక్షర వెలుగు):** సామాజిక వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది, వీరశైవ మత స్థాపకుడు మహాత్మ బసవేశ్వరుడని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ అన్నారు. బసవేశ్వరుడి 889వ జయంతి వేడుకలు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ జయంతి వేడుకల్లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మహాత్మ బసవేశ్వరుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. అభ్యుదయవాది, వీరశైవ మత స్థాపకుడు మహాత్మ బసవేశ్వరుని జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సమసమాజ స్థాపనకు పాటు పడిన వారిని స్మరిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో ఒకరని, కుల, మత భేదాలు లేని సమాజ స్థాపనకే అవిరళ కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని తెలిపారు. మనుషులందరూ ఒక్కటే, కులాలు, ఉపకులాలు లేవన్న మహాత్మ బసవేశ్వరుని ఉపదేశాన్ని ప్రజలందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మ బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందని అలా నడవడమే, మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని ఆయన అన్నారు.

## రాహుల్ నైట్‌క్లబ్ పార్టీ

- బిజెపి విమర్శలకు కాంగ్రెస్ ఘాటు స్పందన
- పెళ్లి వేడుకలను ఇంకా నిషేధించలేదుగా
- విమర్శలు గుప్పించిన సుర్జేవాల, మాణిగం ఠాకూర్
- జవదేకర్ షాంపేయిన్ ఫోటోలు విడుదల



**న్యూఢిల్లీ, మే 3 (అక్షర వెలుగు):** రాహుల్ గాంధీ నైట్ క్లబ్ పార్టీ వీడియో పై కాంగ్రెస్ పార్టీ ఘాటుగా స్పందించింది. బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రణ దీప్ సూర్జేవాలా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.వివాహ వేడుకకు రాహుల్ వెళ్లడం నేరమా? అని ఆ పార్టీనేత సూర్జేవాలా ప్రశ్నించారు. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పుట్టినరోజుకు పిలవకుండా ప్రధాని మోదీ వెళ్లినట్టు.. రాహుల్ గాంధీ వెళ్ళలేదుగా అని అన్నారు. ఆహ్వానిస్తేనే రాహుల్ వివాహ వేడుకకు వెళ్లారని వివరించారు. ఫ్రెండ్ పెళ్లికి హాజరయ్యేందుకు ఆయన ఖాట్మండ్ వెళ్లారని చెప్పారు. రాహుల్ వ్యక్తిగత టూర్‌లో ఉన్నారు. ఇందులో తప్పేముందో చెప్పాలని బీజేపీ నేతలకు సవాలు చేశారు. విద్యుత్ సంక్షోభం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై బీజేపీ వాళ్లు ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కానీ వారి సమయమంతా రాహుల్ కోసమే కేటాయిస్తారని సుర్జేవాలా మండిపడ్డారు. పెళ్ళిళ్లకు హాజరవ్వడం భారత్‌లో నేరం కాదుకుటుంబాన్ని కలిగివుండడం, పెళ్లిళ్లు, వివాహ నిశ్చితార్థ వేడుకలకు హాజరవ్వడం భారత్‌లో సాంప్రదాయకం, నాగరికత అని రణ్‌దీప్ సుర్జేవాల్ అన్నారు. పెళ్లిళ్లు చేసుకోవడం, స్నేహం చేయడం, పెళ్లి వేడుకలకు హాజరవడం ఈ దేశంలో ఇంకా నేరంగా మారలేదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాహుల్ గాంధీ నైట్ క్లబ్ వీడియోలో తప్పేముందని, ఫ్రెండ్ వివాహ వేడుకకు రాహుల్ నేపాల్ వెళ్లడం నేరమా? అని బీజేపీని సూటిగా ప్రశ్నిం చారు. నేపాల్ ఆహ్వానం మేరకే రాహుల్ గాంధీ వివాహ వేడుకకు వెళ్లారు. అంతేగానీ ప్రధాని మోదీలా మాజీ పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంట వేడుకకు వెళ్లలేదు.. షరీఫ్‌తో కలిసి కేక్ కట్టింగ్ చేయలేదు. ఆయన పర్యటన తర్వాతే పఠాన్‌కోట్‌లో ఏం జరిగిందో మనందరికీ తెలుసు అని రణ్‌దీప్ సూర్జేవాలా పేర్కొన్నారు. రాహుల్ చేసిందాంట్లో తప్పేమీ లేదు. గాంధీ కుటంబానికి చెందిన వ్యక్తి సాధారణ వ్యక్తిలా ఓ పెళ్లి రిసెప్షన్ కు హాజరైతే తప్పేంటో చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ మండిపడ్డారు. ఏం తప్పు జరిగిందో దర్యాప్తు చేసుకోవచ్చన్నారు. కారణం లేకుండా కాంగ్రెస్ నాయకుడిని విమర్శించడానికి బదులు ముఖ్యమైన సమస్యలపై దృష్టిసారించాలని హితబోధ చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్,బీజేపీల మధ్య కొత్త రగడకు దాడి తీసింది రాహుల్ నైట్ క్లబ్ వీడియో. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉదయం నుంచి వరుస పెట్టి ట్వీట్లు, పోస్టులతో సెటైర్లు, విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ కౌంటర్‌కి దిగింది. బీజేపీ నేత ప్రకాశ్ జవదేకర్‌కు సంబంధించిన ఫొటోలను ట్విటర్‌లో పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్.. ఇది ఎవరో చెప్పాలంటూ వ్యంగ్యం ప్రదర్శించారు.

## పిల్లల సాక్షిగా ముగ్గురి మెళ్లో తాళి

గిరిజన తెగకు చెందిన వ్యక్తి నిర్వాకం

**భోపాల్, మే 3 (అక్షర వెలుగు):** ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఒకేసారి ఏకంగా ముగ్గుర్ని భోపాల్‌కు చెందిన ఓ వ్యక్తి.పెళ్లి చేసుకున్నాడు. 15ఏళ్లుగా ఆ ముగ్గురితో సహజీవనం చేస్తున్న ఆయన ఒకే మండపంలో వారి మెడలో మూడు ముళ్లు వేశాడు. తమ పిల్లల సమక్షంలో అంగరంగ వైభవంగా పెళ్లి తంతు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లో గిరిజనులు అత్యధికంగా నివసించే అలిరాజ్‌పూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. అలిరాజ్‌పూర్ జిల్లాలోని నాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సామ్రాత్ మౌర్య (40) నన్ బాయి, మేళా, సక్రితో అనే ముగ్గురు మహిళలతో సహజీవనం చేస్తున్నాడు. తాజాగా ఆ ముగ్గురిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆయన గిరిజన సాంప్రదాయం ప్రకారం మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా వివాహతంతు పూర్తి చేసుకున్నాడు. ఏప్రిల్ 30న జరిగిన ఈ పెళ్లి వేడుకలో ఆయన ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కొడుకులు కూడా పాల్గొన్నారు. 2003లో నన్ బాయితో పరిచయం కాగా.. మేళాతో 10ఏండ్ల నుంచి సహజీవనం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం మూడో భార్య సక్రితో ప్రేమలో పడ్డట్లు మార్య చెప్పాడు. ముగ్గురి భార్యల్లో ఒకరు స్కూల్‌లో ప్యూన్‌గా పనిచేస్తుండగా.. మిగిలిన ఇద్దరు వ్యవసాయంతో పాటు ఇంటి పనులు చూసుకుంటున్నారు.

## కులరహిత సమాజం కోసం బసవేశ్వరుడు కృషి

జయంతి ఉత్సవాల సందర్భంగా మంత్రి నివాళి

**మహబూబ్‌నగర్, మే 3 (అక్షర వెలుగు):** మహాత్మా బసవేశ్వర ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచు కోవాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కుల రహిత సమాజ స్థాపనకు కృషి చేసిన వ్యక్తి బసవేశ్వరుడని కొనియాడారు. దానం, ధర్మం, సమ సమాజం కోసం పాటుపడిన సామాజిక వేత్త అని కొనియాడారు. సామాజికవేత్త మహాత్మా బసవేశ్వర 889వ జయంతి ఉత్సవాల సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉన్న మహాత్మా బసవేశ్వర విగ్రహానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత బసవేశ్వర జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడమే కాకుండా, ట్యాంక్ బండ్ పై మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాక అన్ని జిల్లాలలో అధికారికంగా బసవేశ్వర జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట రావు, మున్సిపల్ చైర్మన్ కేసీ నరసింహులు, రైతుబంధు జిల్లా కో–ఆర్డినేటర్ గోపాల్ యాదవ్, డీసీసీబీ ఉపాధ్యక్ష్యుడు కొరమోని వెంకటయ్య, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర, శ్రీశైలం, సత్యనారాయణ, పెద్ద రాములు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణెళిష్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు వెంటనే ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి

అధికారులను ఆదేశించిన మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, మే 3 (అక్షర వెలుగు):** సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోని నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే ఆదాయ, నివాసం, కుల ధృవీకరణ పత్రాలను 24 గంటల్లోనే ఇవ్వాలనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగులు ఆదాయ, కుల , నివాస ధృవ పత్రాలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆలస్యం అవడంతో పై చదువులకు, ఉద్యోగాల దరఖాస్తులకు ఇబ్బందులు కలుగుతుందని నా దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే సంబంధిత పత్రాలు చేతికి అందాలని అధికారులను ఆదేశించారు. వారి సమయం వృథా కాకుండా ఏ రోజుకు ఆ రోజు పత్రాలు వచ్చే విధంగా చూడాలన్నారు. మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా మీ సేవ కేంద్రాలను అందుబాటులో తేవాలని సూచించారు. ఉద్యోగం కోసం అప్లై చేసే వారికి అన్నివిధాలా బాసటగా నిలవాలని చెప్పారు. ఇందుకు ఆర్డీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. మిల్లర్స్ తో సమన్వయం చేస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి అన్నారు. గన్నీ బ్యాగ్స్ డ్యామేజ్ లేకుండా ఇవ్వాలని తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా టార్పలిన్ కవర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు అన్ని కొనుగోలు కేంద్రాలు సందర్శించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో కొత్తగా వచ్చిన సవరణలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలని మంత్రి సూచించారు.

## ఓయూకు రాహుల్ వస్తే విద్యార్థులు చెడిపోతారు: ఎర్రబెల్లి



**వరంగల్, మే 3 (అక్షర వెలుగు):** రాహుల్ ఓయూకి వస్తే విద్యార్థులు చెడిపోతారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పర్యటనతో ఏమీ సాధించలేరని మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత రాహుల్ ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించడంపై అనుమతికి తుది నిర్ణయం వర్సిటీదేనని చెప్పారు. ఓయూకు వెళ్లి నైట్ క్లబ్‌లో పార్టీ గురించి చెప్తారా అని ఎద్దేవా చేశారు.

## రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తుల మృతి




**హైదరాబాద్, మే 3 (అక్షర వెలుగు):** వనస్థలిపురం ఇంజాపూర్ వద్ద అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను స్థానికులు దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సివుంది.




# చలన చిత్రం

## కృష్ణవ్రింద విహారి నుంచి నేడు పాట విడుదల




నటుడు నాగశౌర్య వైవిధ్య భరిత పాత్రలను ఎంచుకంటూ సినీరంగంలో తనకంటూ పత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 'ఛలో' విజయం తర్వాత నాగశౌర్య కథల ఎంపిక పూర్తీగా మారిపోయింది. ఒకే జానర్‌లో సినిమాలు చేయకుండా విభిన్న కథలతో రొటీన్‌కు భిన్నంగా సినిమాలను చేస్తున్నాడు. లేటెస్ట్‌గా ఈయన నటించిన చిత్రం 'కృష్ణ వ్రింద విహారి'. అనీష్ ఆర్ కృష్ణ దర్శకత్వం వహించాడు. ఇప్పటికే చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ ప్రేక్షకులలో అంచనాలు నమోదు చేశాయి. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మే 20న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రంలోని ఏముందిరా అనే పాటను బుధవారం విడుదల చేయబోతున్నట్లు పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచకున్నారు. ఈ పోస్టర్‌లో నాగశౌర్య హీరోయిన్ షిర్లేను ఎత్తుకుని ఉన్నాడు. ఈ పాట మాస్ బీట్‌ల ఉండనున్నట్లు తెలుస్తుంది. ఇదివరకే విడుదలైన వర్షంలో వెన్నెల పాటకు శ్రోతల నుంచి విశేష స్పందన వచ్చింది. షిర్లే సేథియా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతాన్ని అందించాడు. ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## 5న శేఖర్ ట్రైలర్స్ విడుదల


యాంగ్రీమేన్ రాజశేఖర్ గత చిత్రం 'కల్కి' అనుకున్నంతగా ప్రేక్షకుల్ని అలరించ లేకపోయింది. తాజాగా ఆయన నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'శేఖర్'. మలయాళ సూపర్ హిట్ 'జోసెఫ్' చిత్రానికిది అఫీషియల్ రీమేక్ అన్న సంగతి తెలిసిందే. ఇందులో రాజశేఖర్ రిటైర్డ్ పోలీసాఫీసర్ గా నటిస్తున్నారు. నగరంలో జరుగుతున్న యాక్సిడెంట్ కేసెస్ పోలీసులకు సవాల్‌గా మారతాయి. దాంతో పోలీస్ డిపార్ట్ మెంట్ ఆ కేసును రిటైర్ అయినప్పటికీ.. శేఖర్‌కే అప్పగిస్తుంది. దాంతో రంగంలోకి దిగిన శేఖర్‌కు కొన్ని ఆశ్చర్యకర మైన విషయాలు తెలుస్తాయి. ఈ క్రమంలో ఆయన తీసుకొన్న షాకింగ్ డెసిషన్ ఏంటన్నది మిగతా కథాంశం. జీవితా రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాజశేఖర్ కూతురిగా.. ఆయన కుమార్తె శివాత్మిక నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాను ఈ నెల 20న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లో విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు మేకర్స్. అందులో భాగంగానే ఈ నెల 5న 'శేఖర్' చిత్రం ట్రైలర్‌ను విడుదల చేస్తున్నారు. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదికగా అఫీషియల్‌గా ప్రకటించారు. మరి ఈ సినిమా రాజశేఖర్‌కు ఏ స్థాయిలో విజయాన్ని అందిస్తుందో చూడాలి.




## ఎఫ్-3 డబ్బింగ్ పార్ట్ పూర్తి చేసిన వరుణ్ తేజ్

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా.. తమన్నా, మెహ్రీన్ హీరోయిన్లుగా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ మల్టీస్టారర్ 'ఎఫ్ 3'. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్‌ను జరుపుకుంటోంది. దీనిలో భాగంగా వరుణ్ తేజ్ తాజాగా తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్‌ను కంప్లీట్ చేశాడు. ఈ విషయాన్ని స్వయంగా వరుణ్ తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. ఈ మేరకు ఓ పిక్‌ను కూడా పోస్ట్ చేశాడు. కాగా, దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి మే 9న థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. మే 27, 2022 న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. సునీల్, సోనాల్ చౌహాన్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

## షూటింగ్‌లతో బిజీగా రవితేజ



మాస్‌రాజ రవితేజ ప్రస్తుతం వరుసగా సినిమాలను చేస్తూ తీరిక లేకుండా షూటింగ్‌లలో పాల్గొంటున్నాడు. ఏడాదికి రెండు సినిమాలను విడుదల చేసే విధంగా రవితేజ ప్లాన్ చేసుకుంటున్నాడు. ప్రస్తుతం ఆయన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. ఇటీవలే విడుదలైన 'ఖిలాడీ'తో భారీ ప్లాప్‌ను అందుకున్న మాస్‌రాజ ఈ సారి 'రామారావు ఆన్ డ్యూటీ'తో ఎలాగైనా మంచి హిట్టు సాధించాలని కసితో ఉన్నాడు. శరత్ మండవ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో చిత్ర బృందం తరచూ ఏదో ఒక అప్‌డేట్‌తో ప్రేక్షకులను పలకరిస్తుంది. తాజాగా చిత్ర బృందం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. రవితేజ కాజ్యువల్‌గా నడుస్తున్నట్లు పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా మరో అప్‌డేట్‌ను కూడా ప్రకటించారు. ఈ చిత్రం నుంచి మరో సింగిల్‌ను విడుదల తేదీని ప్రకటించారు. 'సొట్టల బుగ్గల్లో' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను మే 7న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇటీవలే విడుదలైన 'బుల్ బుల్ తరంగ్' పాటకు విశేష స్పందన వచ్చింది.

## నేను నిక్షేపంలా ఉన్నాను

### సోషల్ మీడియా పుకార్లపై నటి కవిత



సోషల్ మీడియా హవా పెరిగిన తర్వాత సెలబ్రిటీలపై వస్తోన్న వార్తల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియకుండా పోతుంది. బతికున్నవాళ్లనే చనిపోయారంటూ కొందరు ప్రచారం చేసేస్తున్నారు. ఇలా జరిగడం ఇదేమీ మొదటిసారి కాదు. తాజాగా టాలీవుడ్ సీనియర్ నటి కవితపై కూడా ఇలాంటి పుకార్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. గత రెండు, మూడు రోజులుగా నటి కవిత చనిపోయారంటూ నెట్టింట ఫేక్ న్యూస్‌లు సర్క్యులేట్ అవుతున్న సంగతి తెలిసిందే. దీంతో స్వయంగా కవిత తాను ఆరోగ్యంగానే ఉన్నానని, ఇలాంటి ఫేక్ న్యూస్‌లు నమ్మొద్దని వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'నేను చనిపోయానంటూ యూట్యూబ్‌లో కొందరు వీడియోలు పెడుతున్నారు. అవి చూసి నా స్నేహితులు, బంధువులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే ఆ వీడియోలు డిలీట్ చేయకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుంది' అంటూ కవిత యూట్యూబ్ ఛానెళ్లకి వార్నింగ్ ఇచ్చారు. కాగా బాలనటిగా వెండితెరకు పరిచయమైన కవిత 350కి పైగా సినిమాల్లో నటించారు. ప్రస్తుతం వెండితెరతో పాటు బుల్లితెరపై కూడా నటిస్తున్నారు.

## గాడ్‌ఫాదర్ బిజీలో చిరంజీవి



చిరంజీవి ప్రస్తుతం వరుసగా సినిమాలను చేస్తూ యువ హీరోలకు పోటీనిస్తున్నాడు. అప్పట్లో చిరంజీవికి ఎంత బిజీ షెడ్యూల్ ఉందో, ఇప్పుడు కూడా అంతే ఉంది. ప్రస్తుతం ఈయన చేతిలో మూడు, నాలుగు సినిమాలున్నాయి. ఇక ఇటీవలే ఈయన నటించిన 'ఆచార్య' విడుదలై మిక్స్డ్ టాక్‌ను తెచ్చుకుంది. రామ్‌చరణ్ కీలకపాత్రలో నటించిన ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహించాడు. ప్రస్తుతం ఈయన 'గాడ్ ఫాదర్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. మలయాళంలో సూపర్ హిట్టయిన 'లూసీఫర్'కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజాగా ఈ చిత్ర నుంచి ఒక అప్‌డేట్ బయటకు వచ్చింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈయన ఈ చిత్రంలో ఒక పాటలో కూడా చిరుతో కలిసి స్టెప్స్ వేయనున్నాడు. తాజాగా ఈ పాటకు సంబంధించిన అప్‌డేట్‌ను థమన్ వెల్లడించాడు. ఈ చిత్రంలోని ఓ మాస్ సాంగ్ బీట్‌కు చిరు, సల్మాన్ స్టెప్పులేయ నున్నట్లు తెలిపాడు. ఇక ఈ పాటకు ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా కొరియోగ్రఫి అందిస్తున్నట్లు వెల్లడించాడు. ఈ చిత్రాన్ని ఆర్.బి.చౌదరి, ప్రసాద్ ఎన్‌వి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సత్యదేవ్, నయనతార కీలకపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com